సారూ..అభివృద్ధి వైపు చూడరూ!

- అభివృద్ధికి దూరమవుతున్న కళ్యాణదుర్గం మున్సిపాలిటీ
- ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కమిషనర్
- సమన్వయ లోపంతో కుంటుపడుతున్న అభివృద్ధి
- పన్నుల వసూళ్లలోనూ అధికారుల అలసత్వం
- రూ.43 కోట్ల మేర బకాయిలు


కళ్యాణదుర్గంలో మురుగునీటి కాలువ దుస్థితి


మారెంపల్లిలో తాగునీటి కోసం అవస్థలు

కళ్యాణదుర్గం: ఆయన పేరుకు మున్సిపల్ కమిషనర్.. కుర్చీలో ఉన్నారంటే.. ఉన్నారు. అంతే.. పాలనను పట్టించుకోవడంలేదు. పాలకవర్గాన్నీ సమన్వయం చేసుకోవడంలేదు. దీంతో పాలన గాడి తప్పింది. అధికారులు పన్ను వసూళ్లు, నిధుల వినియోగంలో పూర్తిగా విఫలమయ్యారు. ఫలితంగా కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలకు కష్టాలు తప్పడంలేదు. అభివృద్ధి సంగతి దేవుడెరుగు.. సమస్యలనూ గాలికొదిలేశారు. ఆదాయ వనరులను వినియోగించుకోవడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అధికారులు, పాలకవర్గం మధ్య సమన్వయం లోపించింది. నూతనంగా కళ్యాణదుర్గానికి వచ్చిన కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ వ్యవహార శైలితో పాలకవర్గం విసిగిపోయింది. బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి కమిషనర్ ఒంటెద్దు పోకడతో నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటూ పాలకవర్గాన్ని దూరం పెడుతూ వస్తున్నారు. దీంతో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సైతం కమిషనర్ వ్యవహార శైలిపై మండిపడుతున్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ల సొంత వార్డుల్లో చేసే పనుల వివరాలు కూడా కౌన్సిలర్లకు చెప్పకుండా కమిషనర్ వివక్ష చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉంటే అధికార పార్టీ కౌన్సిలర్లు సైతం ఇటీవల కమిషనర్ వ్యవహార శైలిపై స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు వద్ద ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఎక్కడి సమస్యలు అక్కడే..

ముఖ్యంగా కళ్యాణదుర్గం మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు ఆ దిశగా అడుగులు వేయలేదు. దీంతో కళ్యాణదుర్గంలో ఎక్కడ చూసినా దెబ్బతిన్న రోడ్లు, పైపులైన్ల లీకేజీలు, కాలువల్లో మురుగు నీరు నిండిపోయి జనావాసాల మధ్య దుర్వాసన వస్తోంది. రాత్రి సమయాల్లో దోమల బెడద అధికం కావడంతో స్థానికులు జ్వరాలతో ఆస్పత్రుల పాలవుతున్నారు. తాగునీటికి సైతం పలు కాలనీలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.


కళ్యాణదుర్గం మున్సిపల్ కార్యాలయం

రూ.43 కోట్ల మేర బకాయిలు..

కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అప్పుల ఊబిలోకి వెళ్లిపోతోంది. బకాయిల వసూళ్లపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో పన్నుల రూపంలో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం పక్కదారి పడుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలో శ్రీరామిరెడ్డి, సత్యసాయి త్రాగునీటి పథకాలకు సంబంధించి ఇప్పటివరకు రూ.32 కోట్లు, విద్యుత్ బకాయిలు రూ.2 కోట్లు, ప్రజల నుంచి ఇంటి పన్ను రూ.9 కోట్ల మేర బకాయిలు అందాల్సి ఉంది. అయితే వీటి వసూళ్లపై అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోంది.

బకాయిలపై ప్రత్యేక దృష్టి పెట్టాం



నేను 3 నెలల క్రితం ఇక్కడికి వచ్చాను. వచ్చినప్పటి నుంచి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని పాలకవర్గాన్ని తెలియజేశాం. పన్ను బకాయిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. మున్సిపాలిటీలో 148 కొళాయిలకు సంబంధించి నీటి పన్ను సుమారు రూ. 18 లక్షలు ఉంది. రేపటి రోజు కట్టకపోతే పన్ను చెల్లించని 148 నీటి కొళాయిలను తొలగించేస్తాం. దాదాపుగా రూ.9 కోట్ల పన్నులు వసూళ్లు చేయాల్సి ఉంది. బకాయి వసూళ్లు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. జనవరి 1 నుంచి ప్రత్యేక డ్రైవ్ చేస్తున్నాం.

– వంశీకృష్ణ భార్గవ్, కమిషనర్, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ

అధికారుల్లో సమన్వయలోపం



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మున్సిపల్ పాలకవర్గం, అధికారుల మధ్య సమన్వయ లోపం ఉంది. ఏది జరిగినా కమిషనర్ చైర్మన్‌గా నాకుగానీ కౌన్సిలర్లకు గానీ సమాచారం ఇవ్వడంలేదు. మేమైనా ఏదైనా విషయంగానీ, సమాచారం అడిగితే అప్పుడు సమాధానం ఇస్తున్నారు. అదికూడా నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారు. అధికారులు, పాలకవర్గం సమన్వయంగా ఉంటేనే కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా అధికారులు చొరవ చూపాలి.

– తలారి రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్, కళ్యాణదుర్గం

ఉదిరిపికొండ పైప్‌లైన్‌కు ఎట్టకేలకు మోక్షం

- వైఎస్సార్‌సీపీ హయాంలో పనులకు రూ.16.3 కోట్లు మంజూరు
- టెండర్లు పూర్తయినా కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
- ఆగిన పైప్‌లైన్ పనులు తిరిగి ప్రారంభం కానున్న వైనం
- ఫలించిన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కృషి


ఉదిరిపికొండ ప్రత్యేక పైప్‌లైన్ పనులపై అప్పట్లో అధికారులతో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి(ఫైల్)

ఉరవకొండ: ఉదిరిపికొండ పైపులైన్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. పట్టణ ప్రజలు పడుతున్న నీటి కష్టాలను తీర్చి, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఎంతో కృషి చేశారు. నియోజకవర్గంలో ప్రజలకు శాశ్వతంగా తాగు, సాగునీటి కష్టాలు తీర్చడానికి నిరంతరం పాటుపడ్డారు. దాదాపు రూ.15 కోట్లతో తాగునీటి పైప్‌లైన్ పనులకు నిధులను మంజూరు చేయించారు. ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు మండలాలలో ఈనిధులకు వినియోగించడానికి సిద్ధ పడ్డారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే ఉదిరిపికొండ పైప్‌లైన్‌కు నిధులు మంజూరు:

ఉరవకొండ పట్టణ ప్రజల తాగునీటి కష్టాలు తీర్చడానికి మాజీ ఎమ్మెల్యే విశ్వ ప్రత్యేక చొరవ చూపి జల్‌జీవన్ మిషన్ ద్వారా రూ.16.3 కోట్లతో 17.8 కిలో మీటర్ల వరకు పైప్‌లైన్ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయించారు. ఇందుకోసం ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించగా, ఈ పనులను రామాంజనేయులు అనే కాంట్రాక్టరు దక్కించుకున్నారు. ఈపనుల హక్కులు దక్కించుకున్న కాంట్రాక్టర్ టీడీపీ నేతల ఒత్తిళ్లతో పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం చేశారు. దీంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ప్రభుత్వం మరోసారి టెండర్లు పిలిచే సమయంలో ఎన్నికల కోడ్ అడ్డంకి కావడంతో పనులు ముందుకు సాగలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పనుల ప్రాధాన్యతను గుర్తించి, తిరిగి పనులు చేపడుతుంది. ఈపైప్‌లైన్ పనులు పూర్తయితే ఉరవకొండ పట్టణంలోని 45 వేలకు పైగా ఉన్న జనాభా తాగునీటి కష్టాలు ఉండవు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేయించిన పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితే ఉరవకొండ పట్టణ ప్రజలకు విశ్వేశ్వరరెడ్డి కృషి ఫలితంగా తాగునీటి కష్టాలు తీరే అవకాశం ఉంటుంది.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



ఉదిరిపికొండ నుంచి ఉరవకొండ వరకు త్వరలోనే పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తాం. దాదాపు రూ.16 కోట్లతో 17 కిలో మీటర్ల మేర పైప్‌లైన్ పనులు చేపట్టనున్నాం. పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితే ఉరవకొండ పట్టణ ప్రజలకు తాగునీటి కష్టాలు ఉండవు. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

– అంజుమన్ సఫ్రీన్, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఉరవకొండ

యుద్ధప్రాతిపదికన పైప్‌లైన్ మరమ్మతు


పైప్‌లైన్ మరమ్మతుల్లో ఇంజనీరింగ్ సిబ్బంది

రాయదుర్గంటౌన్: వీరాపురం ఫారెస్ట్ వద్ద రెండు చోట్ల హెచ్చెల్సీ తాగునీటి పంపింగ్ పైప్‌లైన్ మరమ్మతులను యుద్ధ ప్రాతికపదిన పూర్తి చేశారు. శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు లీకేజీ మరమ్మతులు జరిగాయి. లీకేజీ ఉన్న సీసీ పైప్‌లైన్ స్థానంలో ఎంఎస్ పైప్‌లైన్‌ను వేసి వెల్డింగ్ చేశారు. ఈ రెండు లీకేజీలతో భారీ స్థాయిలో నీరు వృథాగా పోతుండేది. మున్సిపల్ ఏఈ నరసింహులు, ఫిట్టర్లు జగన్నాథ్, కిష్టప్ప పర్యవేక్షణలో పనులు పూర్తయ్యాయి. ఆదివారం సాయంత్రానికి పంపింగ్ ప్రారంభించి సోమవారం నుంచి నీటి సరఫరా పునరుద్ధరించనున్నట్లు ఏఈ తెలిపారు.

ఆంజనేయస్వామికి పూజలు

బ్రహ్మసముద్రం: చెలిమేపల్లిలో ఆంజనేయ స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో స్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో పల్లకీ ఉత్సవం నిర్వహించారు.

తిరుపతి ప్యాసింజర్ రైలు ఇప్పట్లో నడవదా?

రాయదుర్గంటౌన్: ఇప్పట్లో రాయదుర్గం ప్రాంత ప్రజలకు కదిరిదేవరపల్లి–తిరుపతి రైలు అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఏమాత్రం కనిపించలేదు. దాదాపు ఏడాది కాలంగా ఈ ప్యాసింజర్ రైలును రైల్వే అధికారులు పాక్షికంగా రద్దు చేస్తూ వస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏదో ఒక కారణం చూపుతూ రైలు రద్దు గడువును పొడిగిస్తూ వస్తున్నారు. ఈ నెల 31 వరకు ఉన్న రద్దు గడువును మరోసారి పొడిగించారు. తాజాగా రాయదుర్గం మీదుగా నడిచే కదిరిదేవరపల్లి–తిరుపతి రైలును వచ్చే ఏడాది మార్చి 1 వరకు రద్దు చేస్తూ గడువు పెంచారు. ప్రస్తుతం ఈ రైలు గుంతకల్లు – తిరుపతి మధ్య మాత్రమే రాకపోకలు సాగించనున్నట్లు నైరుతీ రైల్వే హుబ్లీ డివిజన్ అధికారులు తెలిపారు.


జనవరి 1 నుంచి మారనున్న రైలు నంబర్లు


ఇది వరకే రైల్వే అధికారులు ప్రకటించిన మేరకు రాయదుర్గం మీదుగా రాకపోకలకు సాగించే పలు రైళ్ల సర్వీస్ నంబర్లు వచ్చే ఏడాది జనవరి 1 నుంచి మారనున్నాయి. తిరుపతి – కదిరిదేవరపల్లి (07589), కదిరిదేవరపల్లి – తిరుపతి (07590) ఇకపై 57405/57406గా మారనున్నట్లు తెలిపారు. గుంతకల్లు–చిక్కజాజూరు (07586), చిక్కజాజూరు–గుంతకల్లు (07585) ఇకపై 57415/57416గా మారనున్నట్లు తెలిపారు. ఈ రైలు నంబర్ల మార్పును ప్రయాణికులు గమనించాలని కోరారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని యాచకులు, నిరాశ్రయులకు శ్రీరామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని మసీదులు, ఆలయాలు, రైల్వేస్టేషన్, బస్టాండ్ వద్ద ఉన్న యాచకులు, నిరాశ్రయులకు ఫౌండేషన్ సభ్యులు దుప్పట్లను అందజేశారు.

నెల రోజులు గడవకనే కంకర తేలిన రోడ్లు


రాయదుర్గంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా కంకరతేలిన దృశ్యం


తహసీల్దార్ కార్యాలయ రోడ్డు ఇలా..

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘంలో 'గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యం'.. మూన్నాళ్ల ముచ్చటగా మారింది. రోడ్లపై గుంతల పూడ్చివేత (పాట్ హోల్స్) మరమ్మతు పనులు జరిగి నెలరోజులు కూడా గడవకముందే కంకర తేలి నాణ్యతను ప్రశ్నిస్తోంది. పురపాల కసంఘంలోని వివిధ వార్డుల్లో గుంతల పూడ్చివేతకు రూ.6 లక్షల సాధారణ నిధులతో 108 చోట్ల గుంతల పూడ్చివేత మరమ్మతు పనులు చేశారు. గుంతలు పూడ్చి రోజులు గడవకముందే చాలా చోట్ల కంకర తేలి అధ్వానంగా మారాయి. సిమెంటు, ఇసుక కలపడం, క్యూరింగ్ చేయడంలో కాంట్రాక్టర్ నిబంధనలు పాటించకపోవడమే నాణ్యత లోపాలకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ప్రధానంగా ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోపాటు గుంతలు పూడ్చిన తర్వాత చాలా చోట్ల క్యూరింగ్ చేయలేదు. ఈ కారణంగా రూ.లక్షలు ప్రజాధనంతో చేపట్టిన పాట్ హోల్స్ మరమ్మతు పనులు తేలిపోయాయి. పనులు జరిగిన తీరు, నాణ్యతపై ప్రజలు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యంగా ఉంటేనే బిల్లులు చేస్తాం

నాసిరకంగా జరిగిన గుంతల పూడ్చివేతపై మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రతాప్‌ను వివరణ కోరగా గుంతల పూడ్చివేత మరమ్మతు పనులు నాణ్యంగా ఉంటేనే బిల్లులు చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మరమ్మతు పనులను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తామన్నారు.

జంగమ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


నూతన సంవత్సర క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జంగమ సంక్షేమ సంఘం నాయకులు

ఉరవకొండ: స్థానిక మల్లేశ్వర స్వామి ఆలయంలో నియోజకవర్గ జంగమ సంక్షేమ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆదివారం ఆవిష్కరించారు. జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుడిబండయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు రాచప్పయ్య, తాలుకా అధ్యక్షులు పుట్టప్పస్వామి, ఉపకార్యదర్శి రుశేంద్ర, కార్యదర్శి కొల్లి బసవరాజు, రాజన్న, చంద్రమోహన్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

31న పింఛన్ల పంపిణీ

రాయదుర్గంటౌన్: వివిధ రకాల సామాజిక భద్రత పింఛన్‌ను ఈ నెల 31 నుంచి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31, జనవరి 2 తేదీల్లో పింఛన్ పంపిణీ చేస్తారన్నారు. పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలోని 6,629 మంది పింఛన్ దారులకు రూ.2.83 కోట్లు ప్రభుత్వం విడుదల చేసినట్లు చెప్పారు.

సంక్షిప్త సమాచారం

జేవీవీ జిల్లా కార్యదర్శి మల్లికార్జునకు సన్మానం


మల్లికార్జునను సత్కరిస్తున్న ఎస్‌ఐ వెంకటస్వామి, ఆలయ ధర్మకర్త దొడ్డప్ప తదితరులు

వజ్రకరూరు: తట్రకల్లుకు చెందిన జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మల్లికార్జునను ఆదివారం సన్మానించారు. గుంతకల్లు పట్టణంలోని పోలేరమ్మ ఆలయం వద్ద ఆలయ ధర్మకర్త దొడ్డప్ప ఆధ్వర్యంలో అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా రక్తదాతలు,సామాజిక సేవా కార్యకర్తలు తదితరులను సన్మానించారు. మల్లికార్జున సేవలను గుర్తించి శాలువా, పూలమాలతో సత్కరించారు. కసాపురం ఎస్‌ఐ వెంకటస్వామి, గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్ప, గుంతకల్లు ఆర్‌టీఓ రాజాబాబు, జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలో భక్తుల కొంగు బంగారం నీలగిరిస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ఆకుపూజ, మహా మంగళహారతి, తీర్థప్ర సాదవినియోగం జరిగింది.

అగ్రి బిజినెస్ సెంటర్ల నిర్ణయం విరమించుకోవాలి

బెళుగుప్ప: దేశ వ్యాప్తంగా ఉన్న మార్కెట్లను అగ్రీ బిజినెస్ సెంటర్లుగా మారుస్తామనే నిర్ణయాన్ని ఆపాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బీహెచ్ రాయుడు ఆదివారం ప్రకటనలో అన్నారు. సంతలపైనా, మార్కెట్లపై మోదీ ప్రభుత్వం కన్ను పడిందని, అదానీ, అంబానీలకు కట్టపెట్టడానికి రైతులకు నష్టం చేసే ప్రతిపాదనలు చేసిందన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

గుమ్మఘట్ట: మండలంలోని చెరువుదొడ్డి గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.5,150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి రాయదుర్గం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

బ్రహ్మసముద్రం : బొమ్మగానిపల్లి వంకతండాలో పేకాట స్థావరాలపై ఎస్‌ఐ నరేంద్రకుమార్ సిబ్బందితో ఆదివారం దాడులు నిర్వహించారు. ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.3,720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైభవంగా ఈరన్న స్వామి జాతర


ఈరన్న స్వామిని తీసుకెళ్తున్న భక్తులు

కుందుర్పి: జంబుగుంపలలో యాదవుల ఆరాధ్యదైవం ఈరన్న స్వామి జాతర ఆదివారం నిర్వహించారు. శనివారం స్వామిని కర్ణాటక సరిహద్దునున్న జోడుకాలువల వద్దకు తీసుకెళ్లి, గంగపూజ చేశారు. ఆదివారం ఉదయం స్వామికి హోమం, క్షీరాభిషేకం, మధ్యాహ్నం స్వామిని వెండి పల్లకీలో కెంచంపల్లి గేటు సమీపంలోని ఆరుబయలు వద్దకు గ్రామోత్సవంగా తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి ఈడు చుట్టూ ఆవులు, గొర్రెలు, మేకలను ప్రదక్షిణలు చేయించారు. రాత్రికి గ్రామంలో ఉత్సవం నిర్వహించారు.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

నేడు తలారి రంగయ్య పర్యటన

బ్రహ్మసముద్రం : మండలంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్యతో పాటు రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి తదితరులు సోమవారం పర్యటించనున్నట్లు ఎంపీపీ కంబం చంద్రశేఖర్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు బ్రహ్మసముద్రం మండల కేంద్రం సమీపంలోని నంజాపురం గోపాల్ రెడ్డి వ్యవసాయ తోటలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం


పట్టుబడిన కర్ణాటక మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

కంబదూరు: కుందుర్పి మండలం మలయనూరు శివారులో నేతి హరీష్ అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై 192 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సునీల్‌కుమార్ ఆదివారం తెలిపారు.

కంబదూరు వద్ద శివ అనే వ్యక్తి నుంచి 20 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో డీటీఎఫ్ జయనాథ్‌రెడ్డి, ఎస్ఐలు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

దర్గాహొన్నూరు మార్గంలో కల్వర్టు నిర్మించండి


గరుడచేడు- మీన్లహళ్లి మధ్య ఉన్న వంక

కణేకల్లు: కణేకల్లు–దర్గాహొన్నూరు మార్గమధ్యంలో గరుడచేడు–మీన్లహళ్లి మధ్యలో ఉన్న వంకపై కొత్త కల్వర్టు నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు ప్రజలు కోరుతున్నారు. సుమారు 25 ఏళ్ల క్రితం ఈ వంకపై నిర్మించిన కల్వర్టు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. అంతేకాక రోడ్డుకు చాలా దిగువన కల్వర్టు ఉండటంతో వర్షాకాలంలో కల్వర్టు పైనుంచి ఐదారు అడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తుంటాయి. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించి, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎంపీటీసీకి పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మెట్టు విశ్వ

కణేకల్లు: జక్కలవడికి ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డిని వైఎస్సార్‌సీపీ నేత మెట్టు విశ్వనాథరెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల ఆరోగ్య సమస్యతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని ఇంటికొచ్చిన ఎంపీటీసీని మెట్టు విశ్వ పరామర్శించారు. కణేకల్లులో వైఎస్సార్‌సీపీ నాయకులు మనేగార్ అబ్దుల్లా కుమారుడు దాదాపీర్ (8) ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని మెట్టు విశ్వ పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొకుర్తి జయరామిరెడ్డి, ఆర్కే బద్రీ, టీఎస్ఎస్ రౌఫ్, పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వేమన, బోయ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అయ్యప్ప మాలధారులకు భిక్ష ఏర్పాటు


అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేస్తున్న విశ్రాంత సీడీపీఓ రామాంజనమ్మ

ఉరవకొండ: స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప మాలధారులకు విశ్రాంత సీడీపీఓ రామాంజనమ్మ ఆధ్వర్యంలో ఆదివారం భిక్ష ఏర్పాటు చేశారు. గురుస్వామి గోవర్ధనస్వామి ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో అన్నదాన సేవా సమితి సభ్యులు మీనుగ వెంకటేష్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ నాగస్వామి

వజ్రకరూరు: పదో తరగతి విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని ఏఎస్‌డబ్ల్యూఓ రామ్మోహన్, ఎస్‌ఐ నాగస్వామి తదితరులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం (హాస్టల్)లో ఉరవకొండ ఏఎస్‌డబ్ల్యూఓ డివిజన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలోని టెన్త్ విద్యార్థులకు పదో తరగతి పరీక్షలపై ప్రేరణ,శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక సర్పంచు మోనాలిసా, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కృష్ణానాయక్ తదితరులు హాజరయ్యారు.టెన్త్ సబ్జెక్టుల్లో సందేహాలు ఉంటే వెంటనే ఉపాధ్యాయులను సంప్రదించి, నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్‌వార్డెన్లు సుగుణ, ఓబుళయ్య, ధనుంజయ,నాగ రాజు, రామలక్ష్మి, లక్ష్మి నారాయణమ్మ, ఆదినారాయణ, ఉపాధ్యాయులు తిమ్మప్ప, గౌస్ బాషా, డివిజన్ పరిధిలోని హాస్టళ్ల టెన్త్ విద్యార్థులుపాల్గొన్నారు. వజ్రకరూరు సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు దుప్పట్లు అందించారు.

తగ్గిన టమాట ధర

కూడేరు: మార్కెట్‌లో టమాట ధర తగ్గుముఖం పడుతోంది. దీంతో గిట్టుబాటు ధర లేక పంటపై రైతులు ఆశలు వదిలేసుకుంటున్నారు. మండలంలోని ఇప్పేరు, బ్రాహ్మణపల్లి, మరుట్ల, కమ్మూరు, కొర్రకోడు, కరుట్లపల్లి, రామచంద్రాపురం, కలగళ్ల, జయపురం, ముద్దలాపురం, జల్లిపల్లి, చోళసముద్రం, కూడేరుతో పాటు మరికొన్ని గ్రామాల్లో బోరు బావుల కింద డ్రిప్ సహాయంతో 600 ఎకరాల్లో టమాట పంట సాగు చేశారు. ప్రస్తుతం టమాట కాయ నాణ్యత బట్టి 15 కేజీల బాక్స్ రూ.60 నుంచి 110 వరకు పలుకుతోంది. గతంలో 15 కేజీల బాక్స్ రూ.300 నుంచి రూ.450 వరకు పలికింది. ధరలేక టమాట పంటను పశువులకు వదిలేస్తున్నారు.

ఆయకట్టు కింద పంటల సాగు


కూడేరు: వరి నాటేందుకు నేలను దుక్కి చేసి సిద్ధం చేసుకున్న దృశ్యం

కూడేరు: అరవకూరు చెరువు కింద అరవకూరు, కమ్మూరు గ్రామాల్లో కలిపి ఆయకట్టు భూమి సుమారు 200 ఎకరాలకు పైగా ఉంది. హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ ద్వారా సింగంపల్లి చెరువు నుంచి అరవకూరు చెరువులోకి కృష్ణాజలాలు వచ్చి చేరుతున్నాయి. దీంతో చెరువు నీటితో నిండు కుండలా దర్శనమిస్తోంది. ధర్మవరం కుడి కాలువ ద్వారా కూడా పీఏబీఆర్ నీటితో చెరువును నింపుతారు. చెరువునిండా నీరుండడంతో ఆయకట్టు రైతులు వరి, ఇతర పంటల సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పలవురు రైతులు వరి సాగుకు నేలను ట్రాక్టర్లతో దుక్కి చేసి నాట్లు వేసేందుకు సిద్ధం చేసుకున్నారు. చెరువులో నీరు పుష్కలంగా ఉంది.

ఎర్రగుంటలో కనకదాస జయంతి


గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కుందుర్పి: ఎర్రగుంటలో ఆదివారం కురుబల ఆరాధ్య దైవం కనకదాసు జయంతి నిర్వహించారు. కనకదాసు చిత్రపటాన్ని ట్రాక్టర్ లో అలంకరించి తప్పెట్లు, మేళతాళాలు, గొరవయ్యల నృత్య ప్రదర్శనతో ఊరేగించారు. ఎర్రగుంట,అల్లాపురం గ్రామాల కురుబలు పాల్గొన్నారు. బండమీదపల్లి కార్యక్రమంలో కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, తాలూకా అధ్యక్షుడు నాగరాజు, స్థానిక కురుబ సంఘం నాయకులు పాల్గొన్నారు.